క్లుప్తంగా

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

మూసాపేట: కూకట్‌పల్లి ప్రశాంతినగర్‌లోని సోని కాంప్లెక్స్‌లోని ఎస్.సంజీవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత ఉపాధి శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు జనరల్ సెక్రటరీ డా. ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. వేసవి దృష్టిలో ఉంచుకొని మహిళలకు బ్లౌజ్ డిజైన్, మగ్గం, వర్కు, బ్యూటీషియన్, జ్యూట్ బ్యాగ్ తయారీ, ఎంఎస్ ఆఫీస్, హోం నీడ్స్‌లలో ఉచిత శిక్షణ అందించటానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. శిక్షణ పొందిన అనంతరం ముద్రా లోన్ ఇప్పించేందుకు సహకారం అందిస్తామన్నారు. ఏప్రిల్ 1లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 4 నుంచి తరగతులు ఉంటాయని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం.93961 61936.

సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మూసాపేట: ఫతేనగర్ డివిజన్‌లోని భరత్‌నగర్ హెచ్ఐజీ, హెచ్‌పీ రోడ్డు, ఫిష్ మార్కెట్‌లో రూ.1.96 కోట్లతో నిర్మించనున్న రోడ్డు పనులకు బుధవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్, కృష్ణారెడ్డి, కూతాడి రాములు, తూము జగదీష్, భిక్షపతి, సూర్యనారాయణ, సురేష్ నాయుడు, విజయ్‌కుమార్, సాంబశివరెడ్డి, రవీందర్, ఉమావతి గౌడ్, సూర్యకళ, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా స్వయంవర రిజిస్ట్రేషన్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని ద్వాదశ జ్యోతిర్లింగ భువనేశ్వరి దేవస్థానంలో గురువారం ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు స్వయంవర మహోత్సవం నిర్వహించనున్నారు. ఉచితంగా యువతి, యువకుల వివరాలను రిజిస్ట్రేషన్ చేయించనున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయించుకునే వారి జాతకం, ఫొటో, బయో డేటా, పుట్టిన తేదీ, పుట్టిన స్థలం, పుట్టిన సమయం వంటి వివరాలు ఇవ్వాలని నిర్వాహకులు గజానంద ట్రస్ట్ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు సంప్రదించాల్సిన ఫోన్ నం.79954 74442, 70933 76888.

విద్యుత్ స్తంభాలు, దీపాలు ఏర్పాటు



పాపిరెడ్డినగర్‌లో రోడ్లను శుభ్రం చేయిస్తున్న అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి

ఆల్విన్‌కాలనీ: పాపిరెడ్డినగర్ బస్తీవాసులకు ఎలాంటి సమస్య వచ్చినా.. స్థానిక నేతలు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని పాపిరెడ్డినగర్ బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి తెలిపారు. పాపిరెడ్డినగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు బుధవారం జీహెచ్ఎంసీ ఎలక్ట్రికల్ సిబ్బంది వీధి దీపాలు ఏర్పాటు చేశారు. పాపిరెడ్డి నగర్‌లోని రోడ్ నం.1 నుంచి 21 వరకు శానిటేషన్ సిబ్బంది రోడ్డును శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి భగవంతరెడ్డి, క్యాషియర్ నరసింహులు, వీరాంజనేయ శివాలయం అధ్యక్షుడు పేర్ని ధర్మారావు, చైర్మన్ గడ్డం రాజేశ్వర్‌రెడ్డి, దొడ్ల రాంరెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ యూనివర్సిటీ స్థాపన అనివార్యం

ఉస్మానియా యూనివర్సిటీ: భవిష్యత్‌లో రాష్ట్రంలోనూ డిజిటల్ యూనివర్సిటీల ఏర్పాటుకు అవకాశాలు ఉందని ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి అన్నారు. ఓయూ దూరవిద్య కేంద్రం ఆడిటోరియంలో ఈఎంఎంఆర్‌సీ (ఎడ్యుకేషనల్ మల్టీ మీడియా రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ డిజిటల్ టెక్నాలజీస్ ఫర్ టీచింగ్ అండ్ లర్నింగ్ ఇన్ హైయ్యర్ ఎడ్యుకేషన్ ఎ మూక్స్ పర్‌స్పెక్టివ్) అనే అంశంపై రెండు రోజులు జరిగిన జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. కార్యక్రమానికి హాజరైన లింబాద్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో వివిధ వర్సిటీలలో మాస్టర్ డిగ్రీలు చేసే వారి సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. రాష్ట్రంలో మహిళలు 76 శాతం మంది పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందడం ఉన్నత విద్యలో గొప్ప మార్పునకు సంకేతమన్నారు. ఉన్నత విద్యలో పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య దృష్ట్యా రాష్ట్రంలోనూ డిజిటల్ యూనివర్సిటీ స్థాపన అనివార్యమన్నారు.

సీతారాముల కల్యాణానికి అంతా సిద్ధం



భరత్‌నగర్ కాలనీలోని హరిహర క్షేత్రంలో రాముల వారి కల్యాణానికి ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

మూసాపేట: కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ఆలయాల్లో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయాల నిర్వాహకులు తెలిపారు. ఆలయాల ఆవరణలో చలువ పందిళ్లు, కల్యాణ మండపం, అన్నాదానం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఆంజనేయస్వామి ఆలయాలు, రామాలయాలు, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఎక్కువగా నవమి ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీంతో ఆలయ పరిసర ప్రాంతాల్లో సరికొత్త శోభ సంతరించుకుంది.

- భరత్‌నగర్ కాలనీలోని హరిహర క్షేత్రంలో కోదండ రాముని కల్యాణం ఘనంగా నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆలయంలో పూజలు జరుగుతున్నాయి. గురువారం 10 గంటలకు కల్యాణం అనంతరం అన్నదానం, బెల్లం పానకం, వడపప్పుతో కూడిన ప్రసాదాన్ని పంపిణీ చేయనున్నారు.
- ఆంజనేయనగర్ కాలనీలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో రామల వారి కల్యాణానికి సర్వం సిద్ధం చేశారు. ఉదయం 8గంటలకు ఎదుర్కోలు సన్నాహాలు, 9.30 గంటలకు స్వామివారి విశేషాలంకరణ సేవ, 10.30 గంటలకు శ్రీసీతారామల వారి కల్యాణం, 1గంటకు అన్నదానం, సాయంత్రం 5 గంటలకు మాడవీధుల్లో స్వామివారి ఊరేగింపు ఉంటుందని ఆలయ కమిటి సభ్యులు తెలిపారు.
- జనతానగర్‌లోని శ్రీ సాయి అయ్యప్ప స్వామి ఆలయంలో సభాపతి పవన్‌కుమార్ శర్మ అర్చకుల సమక్షంలో కల్యాణం నిర్వహించనున్నారు.



జనతానగర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయంలో కల్యాణానికి సిద్ధమైన కల్యాణ మండపం

పరీక్షలను భయం లేకుండా రాయాలి



విద్యార్థులకు పెన్‌లు, ప్యాడ్‌లను అందజేస్తున్న కార్పొరేటర్ మహేందర్

మోతీనగర్: బబ్బుగూడ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పెన్‌లు, ప్యాడ్‌లను మూసాపేట కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పరీక్షలను భయం లేకుండా రాయాలన్నారు. ఏ రకంగా రాస్తే ఎక్కువ మార్కులు వస్తాయో వివరించారు. ఉన్నత చదువుల కోసం ఎటువంటి సహాయం కావాలన్నా చేస్తానని హామీ ఇచ్చారు. పేదవాడి బిడ్డలు ప్రయోజకులు కావాలంటే చదువే మూలమన్నారు. పిల్లలు తల దించి చదివితే తల్లిదండ్రులు తల ఎత్తుకొని సమాజంలో తిరుగుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రాణి, నాయకులు ఎర్రస్వామి, శ్రీధర్, కిషోర్, శ్రీనివాస్, మల్లేష్, వెంకట్, నాగరాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ నిర్వాహకులు సిల్ట్ చాంబర్ నిర్మించుకోవాలి



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని వెస్టన్ హిల్స్ అడ్డగుట్ట సొసైటీ కాలనీలో డ్రైనేజీ పొంగుతోందని కాలనీవాసులు స్థానిక కార్పొరేటర్ శ్రీనివాసరావు దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన బుధవారం ఎయిర్‌టెక్ మెషిన్‌ను తెప్పించి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అడ్డగుట్టలో ఉన్న హాస్టల్ బిల్డింగ్స్ వల్ల నిత్యం డ్రైనేజీ పొంగుతూ ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. గతంలో హాస్టల్ ఓనర్స్, నిర్వాహకులతో సమావేశం పెట్టి ప్రతి ఒక్కరూ సిల్ట్ చాంబర్ నిర్మించుకోవాలని చెప్పామన్నారు. హాస్టల్ నిర్వాహకులు సానుకూలంగా స్పందించి పనులు మొదలు పెట్టారని తెలిపారు.

- ఇప్పటి వరకు ఈ విషయమై స్పందించని వారిపై జరిమానా వేస్తున్నట్లు జలమండలి అధికారులు తెలిపారు. అదే విధంగా ఎమర్జెన్సీ పని కింద డ్రైనేజీ లైన్ శాంక్షన్ చేయించి పనులను వెంటనే పూర్తి చేశామన్నారు. డివిజన్‌ను ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు శాయశక్తులా కృషి చేస్తానన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని.. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వర్కు ఇన్‌స్పెక్టర్ మహదేవ్, జలమండలి డీజీఎం వెంకటేశ్వర్లు, మేనేజర్ ప్రశాంతి, సూపర్‌వైజర్ నరేంద్ర, కాలనీవాసులు నిరంజన్‌గౌడ్, రత్నం, లక్ష్మి, సుజాత, వనజ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు వందకు పైగా కంపెనీలు

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- వలంటీర్లు అందుబాటులో ఉండాలని సూచన



జాబ్‌మేళా నేపథ్యంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏప్రిల్ 2వ తేదీన కూకట్‌పల్లి ట్రక్ పార్కు వద్ద జాబ్ మేళా జరుగనుంది. ఈ మేరకు బుధవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కోఆర్డినేటర్ సతీష్ అరోరా ఆధ్వర్యంలో యువజన విభాగం, సోషల్ మీడియా విభాగాల సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జాబ్‌మేళాకు వచ్చే అభ్యర్థులకు అసౌకర్యం కలగకుండా వలంటీర్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో తాగునీరు, అంబులెన్స్, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచుకునేటట్లు చూడాలన్నారు. ఎవరికీ ఎటువంటి ఇబ్బంది కలగకుండా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ జాబ్‌మేళాలో దాదాపు 100కు పైగా కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆవుల రవీందర్‌రెడ్డి, పండాల సతీష్‌గౌడ్, మందడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ సందర్శనకు విదేశీ ప్రతినిధుల బృందం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీని ఫ్రాన్స్ రాయబార కార్యాలయానికి చెందిన ముగ్గురు సభ్యుల బృందం బుధవారం సందర్శించింది. విద్య, పరిశోధన రంగాల్లో పరస్పర సహకారం కోసం వారు హెచ్‌సీయూ అధికారులతో చర్చించారు. భారతదేశంలోని దక్షిణ భారత ఫ్రాన్స్ రాయబార కార్యాలయం సైన్స్ అండ్ అకడమిక్ కోఆపరేషన్ విభాగానికి చెందిన ఫ్రాంకోయిస్‌జేవియర్, సైన్స్ అండ్ అకడమిక్ కోఆపరేషన్ ఆఫీసర్ లూసిల్‌గిల్లెట్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఫ్రాన్స్ మేనేజర్ మిత్రి స్రైహాన్‌తో కూడిన బృందం హెచ్‌సీయూలో పర్యటించింది. హెచ్‌సీయూలోని అంతర్జాతీయ వ్యవహారాల కార్యాలయం డైరెక్టర్ ప్రొఫెసర్ చేతన్‌శ్రీవాస్తవ వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన పలు విషయాల గురించి వారికి వివరించారు.

నీటి వనరుల సంరక్షణ మన బాధ్యత



నీటి పొదుపుపై అవగాహన కల్పిస్తున్న మాజీ కార్పొరేటర్ బాబూరావు

మూసాపేట: వరల్డ్ వాటర్ డే సందర్భంగా హెచ్ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బీ ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ రోడ్డు నం.1లోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం జల సంరక్షణ అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు విచ్చేసి నీటి పొదుపుపై అవగాహ కల్పిస్తూ ప్రసంగించారు. పిల్లల్లో చైతన్యం కలిగిస్తే కుటుంబం మొత్తంలో మార్పు సాధ్యమని తెలిపారు. నీటిని వృథా చేయకుండా పొదుపు చేయాలని కోరారు. పొదుపు చేయడం ద్వారా రానున్న తరానికి నీటి కొరత లేకుండా చేస్తుందన్నారు. నీటి వనరులను సంరక్షించడం మన బాధ్యత అని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ డీజీఎం శంషీర్, మేనేజర్ వైష్ణవి, ప్రధానోపాధ్యాయురాలు మమత, శ్రీకాంత్, దినేష్, శారద తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 10న 'జీ20 దేశాలలో విద్య'పై చర్చ

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఉర్దూ మీడియం టీచర్స్(సీపీడీయూఎంటీ) ఆధ్వర్యంలో ప్రత్యేక ప్యానెల్ చర్చా కార్యక్రమాన్ని ఏప్రిల్ 10న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు సీపీడీయూఎంటీ డైరెక్టర్ ప్రొఫెసర్ మహ్మద్ అబ్దుల్ సమీ సిద్దిఖీ తెలిపారు. ఉదయం 11 గంటలకు సీపీడీయూఎంటీ ఆడిటోరియంలో 'జీ-20 దేశాలలో విద్య' అనే అంశంపై ప్యానెల్ చర్చా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అమెరికా ప్రొఫెసర్ వివియోన్ వాలెస్ థామస్, ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీఐ ప్రొఫెసర్ అమీర్‌ఉల్లాఖాన్, మ్యాథమెటిక్స్ ప్రొఫెసర్ సయ్యద్ నజాముల్‌హసన్, ఓఎస్‌డీ-2 ప్రొఫెసర్ సిద్దిఖీ మహ్మద్ మహమూద్ పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

యువతకు న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని ఆపం



కూకట్‌పల్లి కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు

కూకట్‌పల్లి: టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీపై నిరుద్యోగ దీక్షను ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం కూకట్‌పల్లి కళాశాల వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ ప్రతీక్‌గౌడ్ మాట్లాడుతూ... టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకై 18 రోజులు అవుతున్నా సంఘటనపై ఇప్పటి వరకు రాష్ట్ర ముఖ్యమంత్రి కాని.. మంత్రులు కానీ స్పందించడకపోవడానికి ఖండిస్తున్నామని అన్నారు. ఐటీశాఖ మంత్రి కేటీఆర్ చేసిన వాఖ్యలను వ్యతిరేకిస్తూ వెంటనే ముఖ్యమంత్రి, చైర్మన్ జనార్దన్‌రెడ్డి, కార్యదర్శి అనిత రామచంద్రన్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామాలు చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. యువతకు న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని ఆపమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పవన్, భరత్, ఎస్ఎఫ్‌డీ కన్వీనర్స్ గోపాల్, సనిత్, స్టేట్ వర్కింగ్ మెంబర్ సానిల్, జమిల్, ఏబీవీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కోయిలమ్మ కష్టాలు.. తీర్చిన 'రాము'డు





కోకిల కాళ్లకు చుట్టుకున్న మాంజాను తొలగిస్తున్న రాము, నీటిని తాగుతున్న కోయిలమ్మ

మూసాపేట: కోయిలమ్మ కాళ్లకు మాంజా చుట్టుకొని ఎగరలేని పరిస్థితిలో ఇంటి చెట్టుపై వాలి ఉండటాన్ని ఆ ఇంటి యజమాని గమనించాడు. కాళ్లకు ఉన్న మాంజాను తొలగించి, మంచినీటిని అందించి గాయానికి పసుపు రాశాడు. సాయంత్రం వరకు కూడా కోయిల ఎగరలేని పరిస్థితి నెలకొంది. దీంతో దానికి ఆహారం అందించి ఎగిరేందుకు స్వేచ్ఛగా వదిలేశారు. ఆరోగ్యం చేకూరి తనంతట తాను ఎగిరే వరకు దాని బాగోగోలు చూసుకుంటామని ఆ ఇంటి యజమాని రాము తెలిపారు. వేసవిలో పక్షులకు ఆహారం, నీరు దొరకక ఇబ్బంది పడే అవకాశముందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఖాళీ ప్రదేశాల్లో నీటిని, గింజలను ఉంచాలని సూచించారు. తాను కూడా ఏర్పాటు చేస్తున్నానని తెలిపారు.

సైబర్ నేరాల పట్ల అవగాహన పెరగాలి

గచ్చిబౌలి: కరోనా కాలం తర్వాత సైబర్ క్రైమ్‌లు 300 శాతం పెరిగాయని సైబరాబాద్ డీసీపీ రితిరాజ్ పేర్కొన్నారు. ప్రజల్లో మరింతగా సైబర్ నేరాలపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. బుధవారం గచ్చిబౌలి డీఎల్ఎఫ్ భవనంలోని కాగ్నిజెంట్ కార్యాలయంలో సైబర్ క్రైమ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సైబర్ స్పేస్ కొత్త మార్గాలతో మరింత క్లిష్టంగా మారుతుందన్నారు. సైబర్ నేరగాళ్లు విభిన్న పద్ధతులను ఉపయోగిస్తున్నారన్నారు. ప్రకటనలు, పెట్టుబడి, అద్దె, రుణం వంటి పలు రకాల మోసాల గురించి ఆమె వివరించారు. కాగ్నిజెంట్ ఉద్యోగులు, ఇన్‌స్పెక్టర్ రవీందర్, సబ్ ఇన్‌స్పెక్టర్ అలీమా, సైబర్ యోధులు, ఎస్‌సీఎస్‌సీ కోఆర్డినేటర్లు, భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఖాజాగూడ రోడ్డును పరిశీలించిన అధికారులు

రాయదుర్గం: ఖాజాగూడ కారిడార్‌లోని మధురానగర్, ఖాజాగూడ రోడ్డును జీహెచ్ఎంసీ, ట్రాఫిక్, జలమండలి, విద్యుత్‌శాఖ అధికారులు బుధవారం పరిశీలించారు. జీహెచ్ఎంసీ వెస్ట్‌జోన్ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ శంకరయ్య, జలమండలి జనరల్ మేనేజర్ రాజశేఖర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ తదితరులు ఎలక్ట్రికల్, ఇతర అధికారులు, సిబ్బందితో కలిసి ఇక్కడ పర్యటించారు. ఈ సందర్భంగా మధురానగర్, ఖాజాగూడలోని మురుగు కాలువలను పరిశీలించారు. డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు. ముఖ్యంగా డ్రైనేజీ కాలువల్లో డమ్మీ విద్యుత్ కేబుల్, తాగునీటి పైప్‌లైన్‌ను వెంటనే మార్చాలని అధికారులు నిర్ణయించారు. రోడ్లపైకి మురుగునీరు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా.17, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 28, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 35, పందిరి బీర 45, క్యాబేజీ 9, క్యారెట్ 15, దొండ 35, గుండుబీన్స్ 70, గింజ చిక్కుడు 55, గోకరకాయ 50, కీర 13, దోసకాయ 28, బీట్‌రూట్ 18, ఉల్లిగడ్డ 14.

'బలగం' ప్రజాదరణ పొందడం సంతోషంగా ఉంది



నటులు సుధాకర్‌రెడ్డి, లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

కూకట్‌పల్లి: బలగం చిత్రంలో కొమరయ్య పాత్ర పోషించిన సుధాకర్‌రెడ్డిని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బుధవారం క్యాంపు కార్యాలయంలో సన్మానించి ఆర్థిక సహాయం అందించారు. అదే విధంగా కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన సర్పంచ్ పాత్ర పోషించిన లక్ష్మణ్‌ని కూడా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవ సంబంధాలపై ఎంతో అద్భుతంగా చిత్రీకరించిన ఈ సినిమా ఇంత ప్రజాధరణ పొందడం చాలా సంతోషంగా ఉందన్నారు. అందరూ కలిసిమెలిసి ఉంటేనే ఈ సమాజం బాగుంటుందన్న మంచి సందేశంతో దర్శకుడు వేణు ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారని అన్నారు. తెలంగాణ పల్లెలోని జీవ విధానాన్ని, ప్రపంచానికి తెలియజెప్పిన బలగం చిత్ర బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ముద్దం నరసింహయాదవ్, పండాల సతీష్‌గౌడ్, ఆవుల రవీందర్‌రెడ్డి, కూకట్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



సుధాకర్‌రెడ్డి, లక్ష్మణ్‌లను అభినందించి సన్మానిస్తున్న కార్పొరేటర దొడ్ల వెంకటేష్‌గౌడ్

బలగం చిత్రం నటులకు సన్మానం

ఆల్విన్‌కాలనీ: ఇటీవల విడుదలైన బలగం చిత్రంలో విమర్శకుల ప్రశంసలు అందుకుంటోంది. ఈ చిత్రంలో కొమరయ్య పాత్ర పోషించిన సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ పాత్ర పోషించిన లక్ష్మణ్‌లను బుధవారం ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అభినందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. బలగం సినిమా తనను ఎంతగానో ఆకట్టుకుందన్నారు. ముఖ్యంగా కొమరయ్య పాత్ర పోషించిన సుధాకర్‌రెడ్డి సహజ నటన ఎంతగానో నచ్చిందన్నారు. మానవ సంబంధాలపై ఎంతో అద్భుతంగా చిత్రీకరించారని అన్నారు. తెలంగాణ పల్లెల్లోని జీవన విధానాన్ని ప్రపంచానికి తెలియజెప్పిన బలగం బృందానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, వెంకట్‌నాయక్, వాసుదేవరావు, పోశెట్టి గౌడ్, మోజెస్, మధులత, వాలి, నాగేశ్వరరావు, భిక్షపతి, ఎత్తరి శ్రీను, సాయిగౌడ్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మోటివేషన్‌తో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం



10వ తరగతి విద్యార్థుల్లో ఉత్సాహం నింపుతున్న మోటివేషనల్ స్పీకర్ సంగీత

బాలానగర్: ఏప్రిల్ 3వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు జరుగనున్నాయి. బాలానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివే పదో తరగతి విద్యార్థులు 10/10 జీపీఏ సాధనకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. అందులో భాగంగా ఇప్పటికే ప్రత్యేక తరగతులు నిర్వహించి, సిలబస్ పూర్తి చేసి ఓరియంటేషన్, మోటివేషన్ తరగతులు నిర్వహించారు. పరీక్షల్లో విజయం సాధించడమే తల్లిదండ్రులకు విద్యార్థులు ఇచ్చే పెద్ద బహుమానమని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ సంగీత అన్నారు. పరీక్షలకు వెళ్లేటప్పుడు సమయ పాలన పాటించాలని సూచించారు. కష్టమైన ప్రశ్నలను ఒకటికి, రెండుసార్లు చదివి రాయాలని విద్యార్థులకు సూచించారు. పదిసార్లు చదివే దాని కన్నా ఒకసారి రాస్తే మదిలో నిక్షిప్తమవుతుందన్నారు. క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలను చేరుకుంటారని అన్నారు. మంచి మార్కులతో ఉత్తీర్ణులై జీవితంలో ఇతరులకు మార్గదర్శకంగా నిలవాలని తెలిపారు. బాలానగర్‌లో 10వ తరగతి విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలో 44 మంది తెలుగు మీడియంలో 20 మంది ఉన్నారు. తమ పాఠశాల విద్యార్థులందరూ మంచి మార్కులతో జీపీఏని సాధిస్తారని ఉపాధ్యాయులు ఆశాభావం వ్యక్తం చేశారు.

భయం పోయింది..



మోటివేషన్ క్లాసుతో భయం పోయింది. మాలో ఉన్న భయాలను తొలగించారు. అనేక సందేహాలను నివృత్తి చేశారు. సబ్జెక్టుల వారీగా మేం అడిగగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. దాంతో మాకు కొండంత ధైర్యం వచ్చింది.

– చింటు, పదో తరగతి

ప్రత్యేక ప్రణాళికతో...



విద్యార్థులకు ప్రత్యేక ప్రణాళికతో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నాం. రెండుసార్లు మోటివేషన్ క్లాసు నిర్వహించాం. సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు అందుబాటులో ఉంటున్నాం.

– శ్రీకాంత్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు బాలానగర్